క్లుప్తంగా

నేడు భారత్‌బంద్‌ను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న నాయకులు

నందికొట్కూరు: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం తలపెట్టిన భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని మాలమహానాడు తాలూకా అధ్యక్షులు నగేష్, జిల్లా నాయకులు డాక్టర్ రాజు కోరారు. మంగళవారం మాల మహానాడు కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాలలు తరలివచ్చి భారత్‌బంద్‌లో పాల్గొన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

కుమార స్వామికి విశేష పూజలు


కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య స్వామికి అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు.

వర్షం నీరు తొలగించాలి


నిలిచిన వర్షపు నీరును చూపుతున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు: ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో నిలిచిన వర్షం నీరును వెంటనే తొలగించాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, ఫక్కీర్‌సాహెబ్ మున్సిపల్ అధికారులను కోరారు. మంగళవారం వారు ప్రభుత్వ వైద్యశాలనను సందర్శించి పరిసరాల్లో వర్షం నీరు నిలిచి దోమలు వృద్ధి చెంది రోగులకు మరిన్ని రోగాలు తెచ్చే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు భాస్కరరెడ్డి, గోపాలకృష్ణ, అల్లాబక్కాస్, బాబు, ఖలీల్, కరిముల్లా, మా బాషా పాల్గొన్నారు.

నందీశ్వరునికి ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని నందీశ్వరునికి, బయలు వీరభద్ర స్వామి వారికి మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేషపూజలను నిర్వహించారు. ప్రదోష కాల సమయంలో క్షేత్రపాలకుడైన వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలు నిర్వహించారు. నందీశ్వర స్వామికి నానపెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ


విద్యార్థులకు కిట్లు అందజేసిన ఇండియన్ బ్యాంక్ మేనేజర్ రుక్మాంగద

పగిడ్యాల: ఎన్.ఘణపురం ప్రాథమిక పాఠశాలలోని 25 మంది విద్యార్థులకు పమడర ప్రాతకోట ఇండియన్ బ్యాంక్ మేనేజర్ రుక్మాంగద నోట్ పుస్తకాలు, పెన్సిల్స్, క్రేయాన్స్, కలర్ పెన్సిల్స్, స్కేల్‌తో కూడిన కిట్టును మంగళవారం అందజేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ముర్తుజావలి, టీచర్ జగదీష్ ఉన్నారు.

తిమ్మాపురంలో ఇరువర్గాల ఘర్షణ

బొమ్మలసత్రం: మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలో అరటిపండ్ల వ్యాపారం చేసే రెండు వర్గాల మధ్య మంగళవారం ఘర్షణ చోటుచేసుకుంది. మహానంది ఎస్‌ఐ రామ్మోహన్ రెడ్డి తెలిపిన వివరాలు.. తిమ్మాపురం గ్రామానికి చెందిన సుబ్బయ్య, షరీఫ్ వ్యాపారంలో భాగస్వాములు. వీరు అదే గ్రామానికి చెందిన వ్యాపారులు కరీంబాషా, సుభాన్, బాబులకు రూ.1.20 లక్షలు అప్పుపడ్డారు. ఈ విషయంలో ఇరువర్గాలు గొడవపడి ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఈదాడిలో ఐదుగురికి స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముంచెత్తిన వాన

- పొంగిన వాగులు, వంకలు
- మునిగిన పైర్లు
- ఆందోళనలో అన్నదాత


మిడుతూరు: నీట మునిగిన మొక్కజొన్న పంట

నందికొట్కూరు: నందికొట్కూరు నియోజకవర్గాన్ని వాన ముంచెత్తింది. తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. రహదారులు జలమయమయ్యాయి. ఏపుగా పెరుగుతున్న సమయంలో పైర్లు నీట మునగడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. కొన్ని చోట్ల రోడ్లు కాలువలను, చెరువులను తలపించాయి. నియోజకవర్గంలో అత్యధికంగా పగిడ్యాల మండలంలో 95.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా కొత్తపల్లి మండలంలో 28.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇక నందికొట్కూరు మండలంలో 73.2, జూపాడుబంగ్లా 67.4, మిడుతూరు 65.4, పాములపాడు మండలంలో 45.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

ఉప్పొంగిన నల్లవాగు

పగిడ్యాల: మండలంలో కురిసిన భారీ వర్షానికి నల్లవాగు ఉప్పొంగింది. 95.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా కురిసిన భారీ వర్షానికి నల్లవాగు కాలువ ఉప్పొంగి ప్రవహిస్తోంది. లోతట్టు నివాస ప్రాంతాలు, పొలాలు జలమయమయ్యాయి. నెహ్రూనగర్ ఎస్సీ కాలనీ, పడమర ప్రాతకోట గ్రామంలోని బీసీ కాలనీ, ముస్లీం కాలనీలలో వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరాయి. వర్షం తాకిడికి కంకి దశలో ఉన్న మొక్కజొన్న పైర్లు నేలకొరిగాయి. నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతన్నలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

– పాములపాడు: మండలంలో సోమవారం సాయంత్రం, మంగళవారం తెల్లవారు జాము నుంచి భారీ వర్షం కురిసింది. 10 రోజులకు పైగా ఎండలు వేసవి కాలాన్ని తలపించాయి. పైర్లు కూడా ఎండుదశకు చేరాయి. వ్యవసాయ బావులున్న రైతులు పైర్లకు నీటి తడులు పెడుతున్నప్పటికీ సమృద్ధిగా అందించలేకపోయారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకుని వర్షం కురిసింది. ప్రస్తుతం కురిసిన వర్షం వల్ల కొంత మేర ఎండతీవ్రత తగ్గుముఖం పట్టడంతో పాటు పైర్లకు మేలు చేస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

స్తంభించిన రాకపోకలు

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు భారీ వర్షం కురవటంతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. 65.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌ఓ హనుమంతు తెలిపారు. కాకిలేరు, తర్తూరులోని సుద్దవాగు, పారుమంచాల గ్రామ శివారులోని ఇసుకవాగు ఉప్పొంగి ప్రవహించాయి. పారుమంచాల గ్రామానికి రెండు గంటల పాటు రాకపోకలు స్తంభించిపోగా తర్తూరు గ్రామం నుంచి పొలాలకు వెళ్లేందుకు వ్యవసాయ కూలీల రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.


పారుమంచాల శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న ఇసుకవాగు


పగిడ్యాల: నెహ్రూనగర్‌లో ఇంట్లోకి ప్రవేశించిన వర్షపునీరు


పగిడ్యాల: ఉప్పొంగి ప్రవహిస్తున్న నల్లవాగు కాలువ

పాఠశాలకు సెలవు


స్కూల్ చుట్టూ వర్షం నీరు చేరడంతో ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

తెల్లవారు జామున కురిని భారీ వర్షానికి నందికొట్కూరులోని నీలిషికారిపేటలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పరిసరాలు జలమయమయ్యాయి. పాఠశాల చుట్టూ వర్షం నీరు చేరడంతో ఎంఈఓ సెలవు ప్రకటించాల్సి వచ్చింది. పిల్లలు పుస్తకాల సంచితో పాఠశాలకు రాగా లోపలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఎంఈఓ సెలవు ప్రకటించారని తెలుసుకుని ఇంటి బాట పట్టారు. మారుతీ నగర్‌లో రోడ్లెక్కి వర్షపు నీరు ప్రవహించింది. మున్సిపాలిటీ కమిషనర్ సుధాకర్‌రెడ్డి ఆయా కాలనీలను పరిశీలించారు. వర్షపు నీరు పారుదలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టారు.


మారుతీనగర్‌లో పారుతున్న కాలువలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి

ఆత్మకూరులో 33.2 మి.మీ వర్షం


పొంగిపొర్లుతున్న బవనాసి వాగు


పొలాల్లో నిలిచిన వర్షపునీరు

ఆత్మకూరు: ఆత్మకూరు మండలంలో 33.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వారం రోజులపాటు ఎడతెరపినిచ్చిన వర్షం మంగళవారం ఓ మోస్తరుగా కురిసింది. ప్రస్తుతం కురిసిన వర్షాలకు బవనాసి, గుండ్లకమ్మ, సుద్దవాగులు యథావిధిగా పొంగిపొర్లుతున్నాయి. నల్లమల అటవీ పరిధిలో భారీ వర్షాలు పడడంతో డివిజన్‌లోని అన్ని మండలాల్లో కూడా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వరుసగా కురుస్తున్న వానలకు ఇప్పటికే మొక్కజొన్న పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. వాటిని తొలగించి పొలం ఆరిన తరువాత పెసర, మొక్కజొన్న మరోసారి సాగు చేద్దామనుకుని సిద్ధం చేసుకుంటున్న తరుణంలో మళ్లీ వర్షం కురవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వెలుగోడులో 64.8 మిల్లీమీటర్లు..

వెలుగోడు: మండలంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి 64.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ శ్రీనివాస గౌడ్ తెలిపారు. ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురవడంతో అక్కడక్కడా కాలనీలలో నీళ్లు నిలిచాయన్నారు. ఇటీవల వర్షాలు లేకపోవడంతో ఈ వర్షం మొక్కజొన్న పంటకు, వరి నాట్లకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

జోరుగా పొగాకు నాట్లు

మిడుతూరు: మండలకేంద్రంతోపాటు నాగలూటి, పైపాలెం, కడుమూరు, పీరుసాహెబ్ పేట, చెరుకుచెర్ల, వీపనగండ్ల తదితర గ్రామాల్లో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో వాగులు వంకలు పొంగిపొర్లాయి. చౌట్కూరు, కడుమూరు, ఉప్పలదడియ, కలమందలపాడు, మాసపేట, పైపాలెం, మిడుతూరు గ్రామాల్లో పొగాకు నాట్లు ఊపందుకున్నాయి.


మిడుతూరు: పొలంలో నాటేందుకు పొగాకు నారును తీస్తున్న కూలీలు

విరాళాల సేకరణ

నందికొట్కూరు: వయనాడు వరద బాధితుల కోసం సీఐటీయూ నాయకులు స్థానిక పటేల్ సెంటర్, పాతబస్టాండ్ ప్రాంతాల్లో మంగళవారం విరాళాలు సేకరించారు. సీఐటీయూ నాయకులు భాస్కరరెడ్డి, గోపాలకృష్ణ మాట్లాడుతూ సేకరించిన ప్రతి పైసాను వయనాడు బాధితులకు పంపుతామన్నారు. మానవతావాదులు ముందుకు వచ్చి విరాళాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాగన్న, బాబు, చెన్నయ్య, ప్రదీప్, అనిల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రైతులు సంయమనం పాటించాలి

- ఇరుగ్రామాల రైతులతో చర్చించిన అధికారులు
- ఆయకట్టు రైతులకు న్యాయం చేస్తామని హామీ


మద్దిగుండం చెరువును పరిశీలిస్తున్న వివిధ శాఖల అధికారుల బృందం

మిడుతూరు: మద్దిగుండం చెరువు ఆయకట్టు రైతులకు న్యాయం జరిగేల చర్యలు తీసుకుంటామని, అప్పటివరకు ఇరు గ్రామాల రైతులు సంయమనం పాటించాలని ఆత్మకురు ఆర్‌డీఓ దాసు, డీఎస్పీ రామాంజినాయక్, మైనర్ ఇరిగేషన్ ఈఈ రఘురామిరెడ్డి సూచించారు. మద్దిగుండం చెరువు నీటి వినియోగంపై జలకనూరు, సుంకేసుల గ్రామాల రైతుల మధ్య ఏర్పడిన సమస్యపై ఇరు గ్రామాల రైతులతో మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వేర్వేరుగా చర్చించారు. ఇరు గ్రామాల రైతులకు ఆమోదయోగ్యంగా నిర్ణయం తీసుకుంటామని, అప్పటివరకు ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడవద్దని హితవు పలికారు. అనంతరం విలేకరులతో ఆర్‌డీఓ దాసు మాట్లాడుతూ ఇరు గ్రామాల రైతుల వాదనలు విన్నామని, ప్రస్తుతం పంటలు సాగు చేసిన నేపథ్యంలో సుంకేసుల గ్రామ రైతులు తమ పొలాలకు యథావిధిగా నీటిని వినియోగించుకోవచ్చని, సాగులో ఉన్న పంటలను పూర్తయిన తర్వాత మళ్లీ పంటలను సాగు చేసుకోవద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం ఉన్న పంటలు పూర్తయిన తర్వాత అక్రమ నీటి వినియోగానికి పాల్పడిన వారిని గుర్తించి వారి కనెక్షన్లు తొలగించి చెరువు ఆయకట్టు దారులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వివిధ శాఖల అధికారులు మద్దిగుండం చెరువును పరిశీలించారు. కార్యక్రమంలో మైనర్ ఇరిగేషన్ డీఈ శ్రీనివాసులు, విద్యుత్ శాఖ ఏ ఈ శ్రీనివాసులు, నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ ఓబులేసు, మైనర్ ఇరిగేషన్, విద్యుత్, ఏఈలు రామ్మోహన్ రెడ్డి, క్రాంతికుమార్ పాల్గొన్నారు.


శ్రీనిధి రుణాల రికవరీ గోల్‌మాల్‌పై విచారణ

జూపాడుబంగ్లా: మండల కేంద్రంలో పొదుపు మహిళల శ్రీనిధి రుణాల చెల్లింపుల్లో జరిగిన గోల్‌మాల్‌పై ఏసీ డేగలయ్య, ఏపీఎం అంబమ్మ, శ్రీనిధి మేనేజర్ శ్రీనివాసులు మంగళవారం విచారణ చేపట్టారు. అరుణోదయ గ్రామైక్య సంఘంలోని లిఖిత పొదుపు గ్రూపు సభ్యురాలు కృష్ణవేణి గత ఏడాది అక్టోబర్ 25న రూ.50 వేల రుణం తీసుకుని నెలకు రూ.3 వేల చొప్పున జులై నెలాఖరు వరకు పది కంతులు కట్టింది. అయితే ఆమె ఖాతాలో కేవలం రూ.19,206 మాత్రమే చెల్లించినట్లు చూపిస్తోంది. అలాగే బ్లెస్సీ పొదుపు గ్రూపు సభ్యురాలు శ్యామల రూ.1.50 లక్షల రుణం తీసుకుంది. ఆమె నెలకు రూ.9 వేల చొప్పున నాలుగు నెలలు చెల్లించింది. ఈమె ఖాతాలోనూ రూ.28 వేలు మాత్రమే జమ అయినట్లు చూపిస్తుండటంతో బాధితులు గతంలో ఫిర్యాదు చేశారు. తాము నెలనెలా విలేజ్ బుక్ కీపర్ జ్యోతికి కంతు చెల్లించి రసీదు కూడా తీసుకున్నామని, తమ ఖాతాలో జమ చేయకుండా ఆమె స్వాహా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో అధికారులు విచారణ చేపట్టారు. బాధితురాళ్లను, వీబీకేను విచారించిన అధికారులు.. ఐదు రోజులు సమయం ఇస్తే అక్రమాలు పూర్తిస్థాయిలో వెలికి తీస్తామని హామీ ఇచ్చారు. స్వాహా చేసినట్లు నిరూపణ అయితే వీబీకే నుంచి నిధులు రికవరీ చేస్తామని బాధితులకు భరోసా ఇచ్చారు.


పొదుపు మహిళల ఎదుట వీబీకే జ్యోతిని విచారిస్తున్న ఏసీ, ఏపీఎం, శ్రీనిధి మేనేజర్

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

అత్మకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కావెంజర్, మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఆరు నెలలుగా వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రజాక్, రామ్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ పనికి తగిన వేతనం ఇవ్వడంతోపాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

తడిసిన బియ్యంపై జేసీ విచారణ

మిడుతూరు: మండల పరిధిలోని కడుమూరు గ్రామంలోని 3వ షాపు రేషన్ షాపులో తడిసిన 33 క్వింటాళ్ల బియ్యాన్ని మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ పరిశీలించారు. నివేదిక తయారు చేసి పంపాలని తహసీల్దార్ శ్రీనివాసులకు జేసీ సూచించారు. నందికొట్కూరు ఎంఎల్‌సీ స్టాక్ పాయింట్ (గోడౌన్) నుంచి రేషన్ షాపులకు చేరిన తర్వాత తూకాల్లో భారీగా తేడాలు వస్తున్నట్లు కొందరు విలేకరులు జేసీ దృష్టికి తీసుకెళ్లగా ఎంఎల్‌సీ పాయింట్‌ను తనిఖీ చేసి, నిజమని తేలితే చర్యలు తీసుకుంటామని వివరించారు. ఆయన వెంట జిల్లా సివిల్ సప్లయ్ అధికారి వెంకట్రాముడు, డిప్యూటీ తహసీల్దార్ షానవాజ్, నంద్యాల సీఎస్ డీటీ ప్రసాదు, వీఆర్వో ఆంజనేయులు, డీలర్ కిశోర్ పాల్గొన్నారు.


రేషన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న జేసీ విష్ణుచరణ్

నేడు అధికారుల సమావేశం

మిడుతూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23న నిర్వహించాల్సిన గ్రామ సభలు, గృహనిర్మాణశాఖ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఓడీఎఫ్, ఎస్ డబ్ల్యూపీసీ, పల్స్ సర్వే, పారిశుధ్యం తదితర విషయాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

23న గ్రామసభలు

పగిడ్యాల: మండలంలోని 8 గ్రామ పంచాయతీల పరిధిలో ఈనెల 23న సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రహదారులకు మరమ్మతులు చేయండి

నందికొట్కూరు: గుంతలమయంగా మారిన పట్టణ రహదారులను మరమ్మతులు చేయాలని సీపీఐ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు మంగళవారం మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఒకవైపు గుంతలు పడిన రహదారులు, మరోవైపు విచ్చలవిడిగా వేసిన స్పీడ్ బ్రేకర్ల వల్ల వాహనదారులు, ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారని, తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీపీఐ రైతు సంఘం నాయకులు నాగరాజు, సోమన్న, భాస్కర్‌గౌడ్, సుధాకర్, మాబాషా, లక్ష్మన్న, ఉపేంద్ర ఉన్నారు.

భారీ వృక్షాలు నరికివేత


భారీ వృక్షాన్ని నరికేసిన దృశ్యం

జూపాడుబంగ్లా: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోని భారీ వృక్షాలను అధికారులే నరికివేయిస్తుండటంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 20 ఏళ్ల క్రితం కార్యాలయంలో విధులు నిర్వహించిన అధికారులు కేజీ రోడ్డు నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు కానుక, సరుగుడు, బీర్సు మొక్కలు నాటారు. అవి ఇప్పుడు భారీ వృక్షాలై పలువురికి నీడనిస్తున్నాయి. కార్యాలయ మరమ్మతుల పేరుతో అంతంత వృక్షాలను నరికివేశారు. మొక్కలు నాటి సంరక్షించాలని ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చే ఎంపీడీఓ కార్యాలయ అధికారులే.. వృక్షాలను నరికివేస్తుండటాన్ని చూసి మండల ప్రజలు నవ్వుకుంటున్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ

దొర్నిపాడు: భాగ్యనగరం జెడ్పీఉన్నత పాఠశాల బాలికలు కావ్య, సులోచన, సుకన్య, మేరి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయిలో సిల్వర్ మెడల్ సాధించారు. ఈనెల 17, 18 తేదీల్లో కదిరిలో నిర్వహించిన 46 ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో నంద్యాల జిల్లా తరఫున ద్వితీయ స్థానం సాధించారు. ఈసందర్భంగా మంగళవారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఫిజికల్ డైరెక్టర్ శ్రీధర్, హెచ్‌ఎం ఆదిలక్ష్మమ్మ బాలికలను అభినందించి మెడల్స్, సర్టిఫికెట్స్‌ను అందజేశారు.

శాంతిభద్రతలపై దృష్టి సారించాలి

కొత్తపల్లి: గ్రామాల్లో శాంతిభద్రతలపై దృష్టి సారించాలని ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్ రెడ్డి పోలీస్ సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన స్థానిక పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసి సిబ్బంది, మహిళా పోలీసులకు పలు సూచనలు ఇచ్చారు. తరచూ గ్రామాల్లో పర్యటిస్తూ సమాచారం తెలుసుకుంటూ శాంతి భద్రతలను పరిరక్షించాలన్నారు. మండలంలోని రౌడీషీటర్ల ప్రవర్తనపై ఆరా తీశారు. అసాంఘిక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించవద్దని సూచించారు. నాటుసారా, అక్రమ మద్యం, బెల్టు షాపుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఏఎస్ఐ బాబా ఫకృద్దీన్ ఉన్నారు.


సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ సుధాకర్ రెడ్డి

ప్రారంభానికి నోచుకోని రైతుసేవా కేంద్రాలు


ప్రారంభానికి నోచుకోని జూపాడుబంగ్లా-1 రైతు సేవా(రైతుభరోసా) కేంద్ర భవనం

జూపాడుబంగ్లా: మండల కేంద్రంలో రూ.4.60 లక్షలతో నిర్మించిన రైతుసేవా(రైతుభరోసా)కేంద్రాలు ప్రారంభానికి నోచుకోవడం లేదు. గత ప్రభుత్వం రైతుల సంక్షేమార్థం రూ.21.80 లక్షల చొప్పున నిధులు ఖర్చు చేసి రెండు రైతుభరోసా కేంద్రాలను నిర్మించింది. భవనాలు ప్రారంభించే సమయానికి ఎన్నికల కోడ్ రావటంతో ఆగిపోయాయి. రైతు సేవా కేంద్రం-1(రైతుభరోసా) భవనం పూర్తికాగా, రైతుసేవా కేంద్రం-2 భవనం పూర్తికావొచ్చింది. కాగా ఇంకా బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ భవనాలను వ్యవసాయ అధికారులకు అప్పగించలేదని పీఆర్ ఏఈ బషీర్ తెలిపారు. ఇదిలా ఉండగా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యాక రైతుభరోసా కేంద్రాల పేర్లు కాస్త రైతు సేవా కేంద్రాలుగా మార్చారు.

మహిళలను గౌరవించాలి

ఆత్మకూరు: మహిళలను గౌరవించాలని, వారిపై జరిగే దాడులను అరికట్టాలని గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జవహర్‌నాయక్ అన్నారు. మంగళవారం అంబేడ్కర్ భవన్‌లో గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సుగాలిప్రీతిబాయి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను గౌరవించడం మన భారతీయ సంస్కృతి సంప్రదాయమన్నారు. జనాభాలో సగభాగం మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. అలాంటి మహిళల పట్ల అనుచితంగా వ్యవహరించడం సరికాదన్నారు. మహిళలకు రక్షణ చట్టాలను తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అరుణ్‌కుమార్, మాలమహానాడు నాయకులు ఎలీషా, రమేష్, మల్లయ్య, బాలాజీనాయక్, మురళి, నగేష్, లక్ష్మణ్ నాయక్, పుల్లన్న పాల్గొన్నారు.


సుగాలిప్రీతిబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చెక్కు అందజేత


మృతురాలి భర్త జక్కరయ్యకు బీమా చెక్కును అందిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మలిరెడ్డి మేరమ్మ భర్త జక్కరయ్య(నామిని)కు ఇన్సూరెన్స్ ఆర్థిక సహాయం చెక్కును మంగళవారం భారతీయ స్టేట్ బ్యాంకు మేనేజర్ పవన్‌కుమార్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం ఎస్‌బీవై, పీఎం జేజేబీవై బ్యాంకులో అకౌంట్ ఉన్న ప్రతి ఖాతాదారుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌టీ జిల్లా కో-ఆర్డినేటర్ నబీరసూల్, సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు శంకరయ్య, రాజు, శివనాగరాజు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో రసాయన, వృత్తి విద్యా గ్రూపు, మెకానికల్ సబ్జెక్టులను కాంట్రాక్ట్ పద్ధతిన బోధించేందుకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చక్రధర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనె 24న ఉదయం 10 గంటలకు డెమో ద్వారా ఎంపిక ఉంటుందని, మరింత సమాచారం కోసం 9849006229 నంబరును సంప్రదించాలన్నారు.